సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

డీఎస్పీ విజయ్‌కుమార్

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

ఖిలావరంగల్, మార్చి 12: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కూజా విజయ్ కుమార్ అన్నారు. బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా అనేక నేరాలు జరుగుతున్నాయని, వాటిని సైబర్ క్రైం టీం ఎదుర్కొని బాధితులకు న్యాయం చేస్తున్నదన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని గుర్తుతెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. అలాగే, గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన లింక్‌లను ఓపెన్ చేస్తే మోసపోతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రకాశ్, హెచ్‌వోడీ డాక్టర్ ఆయేషా భాను, డాక్టర్ ఎన్ సత్యవతి, డాక్టర్ తన్వీర్ జహాన్, డీన్ శశిధర్, కోఆర్డినేటర్లు పల్లవి, మహేశ్వరి పాల్గొన్నారు. అలాగే, వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్‌ను సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ చైర్మన్ గంటా రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రతి ఒక్కరూ లక్ష్యాలు చేరుకోవాలి: డీఎంహెచ్‌వో

మహేశ్వరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

నర్సంపేట/వరంగల్‌చౌరస్తా, మార్చి 12: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి ఒక్కరూ చేరుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు సూచించారు. మండలంలోని మహేశ్వరం హెల్త్ సబ్ సెంటర్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని, సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించి, తగిన చికిత్స అందించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, డెమో అనిల్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, ధర్మారంలోని ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని డాక్టర్ సాంబశివరావు సందర్శించి, రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉన్నారు.

భవనం ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

చాకచక్యంగా కాపాడిన పోలీసులు

భవనంపై నిలబడిన శివకుమార్

వరంగల్‌చౌరస్తా, మార్చి 12: ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఆందోళనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడిని మట్టెవాడ పోలీసులు రక్షించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లమ్మబజార్‌లోని ఆదర్శ కాలనీలో నివాసముంటున్న కట్కోజు శివకుమార్(24) బంగారు ఆభరణాలు తయారీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతడు బుధవారం తెల్లవారుజామున 6 గంటలకు తన నివాసముంటున్న రెండు అంతస్తుల భవనం ఎక్కాడు. అక్కడి నుంచి కిందకు దూకేందుకు యత్నించగా స్థానికులు చూసి 100కు డయల్ చేశారు. వెంటనే బీట్ కానిస్టేబుళ్లు నవీన్, వేణుగోపాల్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో ముందు జాగ్రత్తగా కింద పరదాలు ఏర్పాటు చేశారు. అనంతరం భవనం పైకి చేరుకొని శివకుమార్‌ను మాటల్లో దింపి కిందకు తీసుకొచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను స్థానికులు అభినందించారు.

వితంతువుపై పాస్టర్ లైంగిక దాడికి యత్నం

అవమాన భారంతో మహిళ ఆత్మహత్యాయత్నం

చెన్నారావుపేట, మార్చి 12: ఓ వితంతువుపై స్థానిక జర్నలిస్టు, చర్చి పాస్టర్ లైంగిక దాడికి యత్నించిన ఘటన మండలంలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఏడాది క్రితం భర్తను కోల్పోయి చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆమెపై ఓ పాస్టర్ కన్ను పడింది. వారం రోజులుగా ఆమెకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సదరు మహిళపై లైంగిక దాడికి యత్నించడంతో బంధువులకు చెప్పింది. అనంతరం అవమాన భారంతో నిద్రమాత్రలు మింగింది. గమనించిన స్థానికులు మహిళను నర్సంపేటలోని ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఈ విషయమై ఎస్సై రాజేశ్‌రెడ్డిని వివరాణ కోరగా.. ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చెన్నారావుపేట, మార్చి 12: మండలంలోని ఉప్పరపల్లి, చెన్నారావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నట్లు అధికారి తిరుపతి తెలిపారు. నేడు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంట్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో వీధికుక్కల బెడద

వర్ధన్నపేట, మార్చి 11: నిత్యం ఫిర్యాదుదారులు, సామాన్య ప్రజలతో రద్దీగా ఉండే పోలీస్‌స్టేషన్ వీధికుక్కలకు అడ్డాగా మారింది. పట్టణ సమీపంలో ఉన్న వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో వీధికుక్కల సంఖ్య ఎక్కువ కావడంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు జంకుతున్నారు. వీధికుక్కలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌లోనే తిష్టవేస్తున్నాయి. ఏమరపాటుగా వెళ్లే దాడి చేస్తుండడంతో ప్రజలు స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. రహదారుల పక్కన నిర్వహిస్తున్న కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లను తీసుకొచ్చి కొందరు ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వాటిని వీధికుక్కలు తింటూ పోలీస్‌స్టేషన్‌లోని చెట్ల కింద ఉంటున్నాయి. కుక్కలు స్టేషన్‌లోనే పిల్లలు చేయడం వల్ల వాటి సంఖ్య మరింత పెరిగింది. ఇటీవల పట్టణానికి చెందిన ఓ యువకుడు స్టేషన్‌కు వెళ్లడంతో అతడిపై కుక్క దాడి చేసింది. అధికారులు స్పందించి స్టేషన్‌లో వీధి కుక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

కోదండ రామాలయం నూతన కమిటీ ఎన్నిక

బలరాం

ఖానాపురం, మార్చి 12: మండలంలోని రంగాపురం గ్రామ కోదండ రామాలయం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రబెల్లి బలరాం, ఉపాధ్యక్షులుగా మాచర్ల శ్రీనివాస్, కందిక యాకయ్య, మిరాల సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా పిండి కుమార్, కార్యదర్శులుగా వెంగళ శ్రీను, తాళ్ల కొమ్మాలు, ఆర్గనైజేషన్ సెక్రటరీలుగా పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి, బందారపు శ్రీనివాస్, కోశాధికారిగా పొద్దుటూరి వాసుదేవ్, సలహాదారులుగా మాచర్ల కొమ్మాలు, తక్కళ్లపల్లి బాబురావు, ఎర్రబెల్లి నర్సింహారావు, సత్యనారాయణ, కత్తిబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దుగ్యాల పాపారావు, ఎర్రబెల్లి శ్రీనివాసరావు, ఆలయ అర్చకుడు కోటేశ్వర శర్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

కమర్షియల్ స్పేస్‌లు అమ్మకం

★ హనుమకొండలో కిరాయిలు వచ్చు 1650, 2500, 6000 Sft. కమర్షియల్ స్పేస్‌లు తక్కువకు అమ్మకానికి కలవు. వెంటనే సంప్ర: సెల్: 9348199922.
NTW-332339

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

భూ కబ్జాలో అధికారులూ వాటాదారులే..

రౌడీల్లా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోలీస్‌స్టేషన్‌లో పేదోడికి దొరకని న్యాయం

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేసిన వెంచర్ రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, మార్చి 12: నర్సంపేటలో రోజురోజుకు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న భూ కబ్జాల్లో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులూ వాటాదారులేనని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని నెక్కొండ రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడారు. నర్సంపేట ప్రాంతంలో జరుగుతున్న వరుస ఘటనలు, కాంగ్రెస్ నేతల భూ కబ్జాలకు పూర్తి సహకారం అందిస్తున్నది పోలీస్ అధికారులేనని విమర్శించారు. సామాన్యుడికి పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్తే.. వారిపైనే కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, సీపీ, డీసీపీలు నర్సంపేట ప్రాంతంలో జరుగుతున్న ఘటనలపై సమీక్షించాలని డిమాండ్ చేశారు. కోర్టు తీర్పును కూడా పరిగనలోకి తీసుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనమన్నారు. ఈ నెల 13 వరకు స్టేటస్ కో ఉన్నా ఎందుకు పట్టించుకోలేదని పెద్ది నిలదీశారు. రోడ్డు క్లోజ్ చేస్తే పోలీసులు బారికేడ్లు ఎలా ఏర్పాటు చేస్తారని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూమిలో ఉన్నవారికి క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో మాట్లాడినట్లు గుర్తుచేశారు. చాలాకాలంగా నర్సంపేటలో నివాసముంటున్న పేదల భూములపై లోపాలను ఎత్తిచూపి కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజల పక్షాన నిలబడాలని కోరారు. సర్వే నంబర్ 111, 702 అసైన్డ్ భూములు 60 శాతం ఉన్నాయని, 702లో 15 రోడ్లు ఉన్నాయని, వాటికి పోలీసులు బారికేడ్లు పెడతారా అని పెద్ది ప్రశ్నించారు. అనంతరం వెంచర్‌లో ధ్వంసం చేసిన రోడ్డును ఆయన పరిశీలించారు. సమావేశంలో రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, నర్సంపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, ఖానాపురం మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, బండి రమేశ్, నాగిశెట్టి ప్రసాద్, వెంకటేశ్వర్లు, నాయకులు బత్తిని శ్రీనివాస్, పైస ప్రవీణ్, దొమ్మాటి సంతోష్, నాయిని వేణు, దేవోజు సదానందం, దేవోజు హేమంత్ పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి

విజయ్‌పాల్‌రెడ్డి (ఫైల్)

చెన్నారావుపేట, మార్చి 12: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జల్లి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తొగరు విజయ్‌పాల్‌రెడ్డి(46) నర్సంపేటలో ప్లైవుడ్ వ్యాపారంతోపాటు ఇంటి వద్ద వ్యవసాయం చేస్తున్నాడు. బుధవారం ఉదయం వాకింగ్ కోసం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. మధ్యాహ్నం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా బైక్ కనిపించింది. చుట్టుపక్కల వెతకడంతో వ్యవసాయ బావిలో అతడు శవమై కనిపించాడు. ప్రమాదవశాత్తు బావిలో పడడంతో ఈత రాక మృతి చెంది ఉంటాడని స్థానికులు తెలిపారు. మృతుడి తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'కులవివక్ష వ్యతిరేక పోరాటాలకు సిద్ధం కావాలి'

వరంగల్‌చౌరస్తా, మార్చి 12: శాస్త్రసాంకేతిక రంగం అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో సైతం కులవివక్ష, అంటరానితనం పల్లెల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కనిపిస్తున్నదని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. శివనగర్‌లోని రఘునాథ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా ప్రకటించుకొని కుల వివక్షపై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు సీహెచ్ రంగయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న వేణు

జూనియర్ లెక్చరర్‌గా వేణు ఎంపిక

పర్వతగిరి, మార్చి 12: టీజీపీఎస్సీ ద్వారా వెలువడిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో మండలకేంద్రానికి చెందిన ఎన్నమనేని వేణు విజయం సాధించాడు. ఈ మేరకు అతడిని బుధవారం స్థానికులు అభినందించారు. రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వేణు నియామక పత్రం అందుకున్నాడు. వేణు హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తించనున్నారు.

రేపటి నుంచి అధ్యయన బ్రహ్మోత్సవాలు

రాయపర్తి, మార్చి 12: కొండాపురంలోని రుక్మిణీ సత్యభామ సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. హోలీ పర్వదినం రోజు రుక్మిణీ సత్యభామతో స్వామి వారికి పరిణయ ఘట్టం జరిపించడం ఆనవాయితీ. 13న యాగశాల ప్రవేశం, 14న నిత్యహోమం, రాత్రి 8 గంటలకు ఎదుర్కోళ్ల ఉత్సవం, 10 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత చెన్నకేశవస్వామి పరిణయ ఘట్టం. 15న లక్ష్మీ పూజ, 16న రథోత్సవం, పారువేట, 17న రాత్రి 10 గంటలకు రుక్మిణీ సత్యభామతో స్వామి వారి ఏకాంత సేవతో వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కొమ్మాల జాతరలో కానరాని సౌకర్యాలు

గీసుగొండ, మార్చి 12: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి మహా జాతర శుక్రవారం రాత్రి ప్రారంభం కానుంది. జాతరకు సమయం సమీపిస్తున్నా అధికారులు మాత్రం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయలేకపోయారని ప్రజలు విమర్శిస్తున్నారు. జాతర ప్రాంగణంలో పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో దుకాణాదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిలోని ఆర్చి నుంచి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా మొరం పోశారు. నీళ్లు పట్టకపోవడంతో విపరీతంగా దుమ్ము లేస్తుండడంతో వాహనాలపై, కాలినడకన వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా పూర్తి స్థాయిలో లేదని స్థానికులు అంటున్నారు. అలాగే, జాతరకు తెలంగాణ, ఏపీలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. వారు బస చేసేందుకు ఆలయ ప్రాంగణంలో కాటేజీలు లేదా రూమ్స్ సౌకర్యం లేకపోవడంతో భక్తులు వెంటనే తిరుగు ప్రయాణం అవుతున్నారు. అక్కడ ఉండేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడమే ప్రాధాన కారణంగా తెలుస్తున్నది. అధిక సంఖ్యలో భక్తులు ఎడ్ల బండ్లపై, వాహనాల్లో వచ్చి దర్శనం చేసుకొని అక్కడే విడిది చేసుకొని తిరిగి వెళ్తుంటారు. అన్ని రాజకీయ ప్రభబండ్లు వస్తుంటాయి. వెంటనే అధికారులు స్పందించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

జాతరలో భారీ పోలీసు బందోబస్తు

జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి, గీసుగొండ సీఐ మహేందర్ ఆధ్వర్యంలో 500 మంది వివిధ స్థాయి పోలీసులు విధుల్లో ఉంటారని తెలిపారు. ఆర్చి నుంచి వన్‌వే చేస్తామని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఏసీపీ చెప్పారు.

మూడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

వరంగల్: మాట్లాడుతున్న బిర్రు మహేందర్

వరంగల్/నర్సంపేట/వర్ధన్నపేట/సంగెం/పర్వతగిరి, మార్చి 12: ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా వరంగల్‌లోని గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలను ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, నర్సంపేట పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను డీబీడీపీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి సందర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రోజే వర్గీకరణ చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటకు కట్టుబడి ఉండాలన్నారు. సంగెంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్ సందర్శించి మాట్లాడారు. వర్గీకరణను నాలుగు గ్రూప్‌లుగా విభజించాలని డిమాండ్ చేశారు. పర్వతగిరిలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఉపాధ్యక్షుడు జిల్లా ధర్మయ్య మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను సింగారపు రమేశ్ ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాట్లాడుతూ వర్గీకరణను చట్టబద్ధత కల్పించకముందే ఉద్యోగ నియామకాలు చేపట్టడం మాదిగలకు అన్యాయం చేయడమేనన్నారు.

విద్యార్థుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బోధన

సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఫౌండర్ గంటా రవికుమార్

కేక్ తినిపిస్తున్న గంటా రవికుమార్

వరంగల్, మార్చి 12: విద్యార్థులు, తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యాబోధన అందిస్తున్నట్లు సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఫౌండర్ గంటా రవికుమార్ అన్నారు. సత్యం కన్వెన్షన్ హాల్‌లో బుధవారం సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ 24వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంలో 24 ఏళ్ల సుదీర్ఘ ప్రస్తానం కొనసాగిస్తున్నామని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అనతి కాలంలోనే ఆరు రాష్ట్రాల్లో సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థులు ఇచ్చిన ధైర్యంతోనే గోల్డెన్ ఓక్ స్కూల్‌ను ప్రారంభించి, నాణ్యమైన విద్య అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్స్ కందుకూరి విజయకుమార్, కలువల శ్రీనివాస్, సెంటర్ కో ఆర్డినేటర్లు పోశాల సతీశ్, ఎర్ర ప్రకాశ్, మామిడి రంజిత్, వడ్లకొండ రాజ్‌నారాయణ, నేరెళ్ల క్రాంతి, తౌటం శ్రవణ్, ట్రైనర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీందర్

సంగెం, మార్చి 12: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీవో రవీందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో బుధవారం ఆయన సమీక్షించారు. ప్రతి గ్రామంలో తాగునీరు అందించే పైపులకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీటి బావుల్లోని విద్యుత్ మోటర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. తాగునీటి ఇబ్బందులు ఉంటే ముందస్తుగా రైతుల వద్ద బావులను అద్దెకు తీసుకునేందుకు గుర్తించాలన్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. ఈజీఎస్‌లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కొమురయ్య, ఈజీఎస్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే, సంగెం మండల పీఆర్ ఏఈగా అభిరాం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు. అంతేకాకుండా మొండ్రాయి, ముమ్మిడివరం, గొల్లపల్లి ప్రత్యేకాధికారిగా విధులు నిర్వర్తిస్తారన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది రావొద్దు

గీసుగొండ: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రవి శంకర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారికి సూచనలు చేశారు. తహసీల్దార్ రియాజుద్దీన్, డీఈ కిషన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఏఈ వేణు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న నాయకులు

కరీమాబాద్, మార్చి 12: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని సీపీఎం కరీమాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు గున్నాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు బుధవారం వరంగల్ 32వ డివిజన్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గున్నాల ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు నెలనెలా రూ. 2500 అందించాలని డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్లు వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని నేటికీ అమలు చేయలేదన్నారు. ఇంటింటా సర్వే చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో అప్పాజీ, వాణి, ఉపేందర్, భాగ్యలక్ష్మి, రమ్య, రజిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు

రైతువేదికలో రైతులతో సమీక్షిస్తున్న అధికారులు

రాయపర్తి, మార్చి 12: మండలంలో ఎవరైనా నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సాగు, తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో గట్టికల్, పానీష్‌తండా, జయరాంతండా (ఎస్), ఊకల్ గ్రామాలకు చెందిన రైతులు, ప్రతినిధులతో సమీక్షించారు. కొందరు రైతులు మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్లను ధ్వంసం చేస్తూ శుద్ధి చేసిన జలాలను పంటలకు మళ్లిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎస్సారెస్పీ ప్రధాన, ఉప కాల్వలకు గండ్లు కొడుతూ దిగువకు తీసుకెళ్తున్నారన్నారు. అనుమతి లేకుండా ఇలాంటి చర్యలు చేపట్టొద్దని సూచించారు. సమీక్షలో ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, ఏవో గుమ్మడి వీరభద్రం, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ సర్కిల్ కార్